క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తుల అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు రెండు గ్రామాల్లో గుడాల గోపి ఎన్నికల ప్రచారం

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెంకటాపురంలో సోమవారం ఉదయం 8గంటలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొనాలని ఆయన కోరారు.

పోడూరులో..

పోడూరు: పాలకొల్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి సోమవారం మధ్యాహ్నం 2గంటల నుంచి రావిపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ పితాని చిన్నా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎన్‌కేకు ఉగాది కవి పురస్కారం



అమలాపురంలో ఎన్‌కే నాగేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

పెనుగొండ: ప్రముఖ కవి, రచయిత ఎన్‌కే నాగేశ్వరరావుకు శ్రీశ్రీ జాతీయ కళావేదిక ఉగాది కవి పురస్కారం దక్కింది. ఆదివారం అమలాపురంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో నాగేశ్వరరావును సత్కరించి, పురస్కారాన్ని అందించారు. సత్కారాన్ని కళావేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, జిల్లా శాఖ కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ అందించారని నాగేశ్వరరావు స్థానిక విలేకరులకు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: మహదేవపట్నంలో ఓ యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఈ నెల 6వ తేదీన కుటుంబ సభ్యులు పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాగా యువతి ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం తెలిసిన ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమేశ్వరుడికి భస్మాభిషేకం



గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామిని సుందరంగా అలంకరించిన దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని పంచారామక్షేత్రం శ్రీ ఉమాసోమేశ్వర జనార్దన స్వామి వారి దేవస్థానంలో కొలువైన శ్రీఉమా సోమేశ్వర స్వామివారికి శోభాకృత నామ సంవత్సరం చివరి మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కందుకూరి సోంబాబు, టేకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక భస్మాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వ హణాధికారి డి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ లోక కల్యాణార్థం స్వామి వారికి భస్మాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పరవళ్లు

● నాడు నేడుతో పేదలకు నాణ్యమైన విద్య ● కార్పొరేట్‌ను తలదన్నేలా వసతులు



నాడు ప్రభుత్వ పాఠశాలలంటే చులకన... నేడు ప్రభుత్వ పాఠశాలలంటే కార్పొరేటు స్థాయిని మించిన హంగులు.. నాణ్యమైన విద్యా బోధన పేదలకు అందుబాటులోకి ఇంగ్లిషు మీడియం ఇదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కు మార్పు. హేళన చేసిన నోటికి తాళం వేశారు. ఊడి పోయిన స్లాబులు, ఆరుబయటకు వెళ్లేందుకు కనీసం సౌకర్యం లేని పాఠశాలల నుంచి నేడు కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దారు. ప్రతీ పాఠశాల సర్వాంగ సుందరంగా మారింది. ఆచంట నియోజకవర్గంలో మొదటి దశలో 67 పాఠశాలలకు, రెండవ దశలో 147 పాఠశాలల మహర్దశ కలిగింది. మొదటి దశలో పెనుగొండ మండలంలో 16, ఆచంట మండలంలో 14, పెనుమంట్ర మండలంలో 19, పోడూరు మండలంలో 18 పాఠశాలలను రూ.11,85,43,000తో తీర్చిదిద్దగా, రెండో దశలో పెనుగొండ మండలంలో 32 పాఠశాలలు, ఆచంట మండలంలో 44 పాఠశాలలు, పెనుమంట్ర మండలంలో 29 పాఠశాలలు, పోడూరు మండలంలో 42 పాఠశాలలను రూ.44, 42, 13,000తో తీర్చిదిద్దారు. – పెనుగొండ



కవిటంలోని జెడ్పీ పాఠశాల



గుమ్ములూరులోని జెడ్పీ పాఠశాల



వెంకట్రామపురంలో ఆకట్టుకుంటున్న ప్రాథమిక పాఠశాల



సిద్ధాంతంలో హంగులతో పాఠశాల



సిద్ధాంతంలో ఆకర్షించే రంగుల్లో పాఠశాల ముఖద్వారం



కవిటంలోని ప్రాథమిక పాఠశాల



మార్టేరులో డిజిటల్ విద్యాబోధన నిర్వహిస్తున్న దృశ్యం



కొడమంచిలిలో సర్వాంగ సుందరంగా ప్రాథమిక పాఠశాల



కార్పొరేటు స్థాయిలో సిద్ధాంతం పాఠశాలలో వాష్ బేసిన్‌లు

సీఎం జగన్ పాలనకు నీరాజనాలు

పాలకొల్లు అర్బన్: గత ఐదేళ్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాల వలన ప్రజలు లబ్ధి పొందారని, దీంతో ఎన్నికల ప్రచారంలో తమను స్వాగితిస్తూ హారతులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు చెప్పారు. పాలకొల్లు పట్టణం 26వ వార్డులో ఆదివారం ఉమాబాల, గోపి సంయుక్తంగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. వీరికి గడప గడపనా ఆదరణ లభించింది. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ పాలనే మళ్లీ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందించి దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని పథకాలను రాష్ట్రంలో ప్రజలకు అందించారన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని రూ.25 లక్షలకు పెంచడంతో పేద రోగులు హర్షిస్తున్నారన్నారు.

సహించలేకే అబద్ధాల ప్రచారం

పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థినైన తనకు రోజురోజుకీ ఆదరణ పెరగడంతో ఎమ్మెల్యే నిమ్మల సహించలేకపోతున్నారని విమర్శించారు. తాను ఓట్లు కొనుగోలు చేస్తానని అబద్ధ ప్రచారం చేస్తున్నారని గుడాల గోపి దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు మేలు జరగడం వల్ల సీఎం జగన్ పాలనను మెచ్చుకుంటున్నారని గుడాల గోపి స్పష్టం చేశారు. టీడీపీ హయంలో జన్మభూమి కమిటీ పేరుతో లంచాలు వసూలు చేసుకుని అరకొర సంక్షేమ పథకాలు అమలు చేసేవారని విమర్శించారు.

నా భర్తను ఆశీర్వదించండి

గుడాల గోపి భార్య మంగతాయారు మహిళలకు బొట్టు పెట్టి తన భర్తను ఆశీర్వదించాలని ప్రచారం చేశారు. ఆమెతో పాటు కుమారుడు సాయిబాలాజీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అడబాల వెంకటరమణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మోర్త గిరీష్, వార్డు ఇన్‌చార్జ్ పాలపర్తి లాల్ రోషన్, వార్డు నాయకులు తుమ్మల సుబ్బారావు, వేమవరపు నాగరాజు, బొల్లా వేణుగోపాల్, కందుల రమేష్, పార్టీ నాయకులు చిట్టూరి ఏడుకొండలు, మద్దా చంద్రకళ, కర్రా జయసరిత, విప్పర్తి ప్రభాకరరావు, ఎం.మైఖేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు అర్బన్: 26వ వార్డులో బ్రోచర్ అందిస్తున్న ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు



పాలకొల్లు అర్బన్: 26వ వార్డులో ప్రచారం ఇస్త్రీ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

సూపర్ సిక్స్ పథకాలకు స్పందన కరువు



మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు మేనిఫెస్టోలో రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల నుంచి స్పందన లేదని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయుడు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ప్రజలు గ్రహించారన్నారు. ప్రజలు చంద్రబాబుని ఈ ఎన్నికల్లో పరిగణలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలు నచ్చడం లేదని వివరించారు. ప్రజల్ని మోసం చేయడమే లక్ష్యంగా సాధ్యం కాని హామీలను ప్రజలకిస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ మేనిఫెస్టోని బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేస్తారని ప్రజలకు నమ్మకం కలిగిందని పేర్కొన్నారు. గత 5 ఏళ్లలో నవరత్నాల పథకాలను ప్రజలకు ఇచ్చి నూటికి నూరుశాతం అమలు చేశారని స్పష్టం చేశారు. ప్రజలు జగన్‌నే సీఎం కావాలని కోరుకుంటున్నారని శేషుబాబు వివరించారు.

వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలి

నరసాపురం: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పెద్ద ఎత్తున కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజును గెలిపించాలని ముదునూరి సతీమణి శారదావాణి ప్రజలను కోరారు. తన భర్త గెలుపు కోరుతూ శారదావాణి పట్టణంలో చేపట్టిన ప్రచారం నాలుగో రోజుకు చేరింది. ఆదివారం ఆమె పట్టణంలోని 2వవార్డు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తదితరులు ఉన్నారు.

లక్ష్మణేశ్వరంలో..

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి ముదునూరి ప్రసాదరాజుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా మరోమారు గెలిపించాలని కోరుతూ ముదునూరి శ్రీకృష్ణంరాజు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండాలన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, పరసా శ్రీను, అంద్రాజు చల్లారావు, దొంగ మురళీకృష్ణ, కడలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం: 2వ వార్డులో ప్రజలను మహిళను ఓటు అభ్యర్థిస్తున్న శారదావాణి



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలో ప్రచారం చేస్తున్న శ్రీకృష్ణంరాజు

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్

పెనుమంట్ర: వర్కింగ్ జర్నలిస్టులు చిరకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై రూపొందించిన 15 అంశాల జర్నలిస్ట్ మేనిఫెస్టోను రాష్ట్రంలో వివిధ రాజకీయ పక్షాల అగ్రనేతలకు అందజేశామని, వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే దీనిపై రాజకీయ పక్షాల అగ్రనేతలు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం మార్టేరు రెడ్డి కల్యాణమండపంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సోమసుందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలో పనిచేస్తున్న వేలాదిమంది వర్కింగ్ జర్నలిస్టులకు వృత్తి, వేతన భద్రత కల్పించాలని కోరారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు.



మొగల్తూరు: వారతిప్పలో ఓ వృద్ధురాలిని ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని కోరుతున్న ప్రసాదరాజు



మొగల్తూరు: వారతిప్పలో పర్యటిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

గ్రామాల్లో ప్రచారోత్సాహం

గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. మే 13న సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తున్నందున గ్రామాల్లో అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ ఐదేళ్లల్లో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరాలను పేర్కొంటూ మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్నారు. ఆదివారం మొగల్తూరు మండలం వారతిప్పలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, పెనుమంట్ర మండలం భట్లమగుటూరు గ్రామంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రచారం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పెనుమంట్ర: భట్లమగుటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

వైభవంగా భోగేశ్వర స్వామి కల్యాణం

కాళ్ల: బొండాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీజనార్దనస్వామి, భోగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి భోగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభోగంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు హాజరయ్యారు. ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మందే నాగరాజు, ఆలయ చైర్మన్లు కోట వెంకట రామ సూర్యనారాయణ, మందపాటి రాము ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయంలో వేద పండితులు బ్రహ్మశ్రీ దోనేపూడి కృష్ణ పరమాత్మ, శ్రీమాన్ వాడపల్లి రామాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మన్నే శ్రీనివాస్, ఆలయ ఈవో ఆంజనేయరాజు, మన్నే సోమేశ్వరరావు, పెనుమత్స రంగరాజు, మేక వెంకన్నబాబు, గ్రామ పెద్దలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.